క్లుప్తంగా

శ్రీసీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలోని సీతారామచంద్ర స్వామి వారికి పునర్వసు నక్షత్రోత్సవాన్ని పురస్కరించుకుని పంచోపనిషత్ ద్వారాభిషేకం, పరివార దేవతార్చనలు, సదస్యం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

పిల్లలపై వేధింపులను అరికట్టాలి



మాట్లాడుతున్న త్రివేణి

ఎల్లారెడ్డిపేట: మైనార్టీ తీరని పిల్లలపై వేధింపులను అరికట్టడంలో సమాజంలోని అందరూ భాగస్వాములు కావాలని జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ త్రివేణి అన్నారు. అల్మాస్‌పూర్‌లో హెల్ప్‌లైన్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలపై ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని, వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వంద డయల్ చేయాలన్నారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యానేరమన్నారు. టీం సభ్యులు శ్రావణ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ గ్రామంలో శుక్రవారం చీర్లవంచ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సురభి సరిత, ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

నిధులున్నా.. పనులు సున్నా

- రహదారులకు నిధులు మంజూరైనా ముందుకు జరగని పనులు
- గ్రామాల్లో తొలగని రహదారి సమస్యలు

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడితే మరికొన్ని గ్రామాల్లో నిధులున్నా పనిచేయడం లేదు. రహదారి సౌకర్యం లేక కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరికొన్ని గ్రామాల్లో నిధులు మూలుగుతున్నాయి.

-మండలంలోని సుద్దాల, కనగర్తి, నిజామాబాద్, వెంకట్రావుపేట, కొండాపూర్, నిమ్మపల్లి గ్రామాలను కలుపుతూ ఉన్న రహదారి మరమ్మతుకు రూ. 83 లక్షలు మంజూరు అయి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించడం లేదు.

➡ మామిడిపల్లి-నిజామాబాద్ గ్రామాల మధ్య రహదారి మరమ్మతు రూ.కోటి 3 లక్షలు వచ్చి ఉన్నా పనులు మొదలు కావడంలేదు.



అధ్వానంగా మారిన మామిడిపల్లి-నిజామాబాద్ రహదారి

➡ మామిడిపల్లి-అజ్మీరాతండా వరకు గల రోడ్డుకు రూ.4 కోట్లు పనులను ఎమ్మెల్యే రమేశ్ బాబు కొన్ని నెలల క్రితమే ప్రారంభించారు.

➡ చంద్రంపేట-నుంచి మరిమడ్ల రహదారి కోసం రూ.3.50 కోట్లు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా పనులు జరుగలేదు.



నడవడానికి వీలులేకుండా తయారైన నిమ్మపల్లి రహదారి

➡ కోనరావుపేట మండలం సుద్దాల-రామన్నపేట గ్రామాల మధ్య ఉన్న రహదారి కంకర రాళ్లతో నిండిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా ఇప్పటివరకు రాలేదు.

➡ వేములవాడ-మర్తనపేట రహదారికి రూ.45 లక్షలు వచ్చినా పనులు జరుగడం లేదు.

➡ జెడ్పీ రోడ్ నుంచి కొండాపూర్ వరకు గల రోడ్డుకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



రహదారులు అధ్వానంగా మారాయి. సుద్దాల నుంచి రామన్నపేట వరకు రోడ్డంతా కంకర తేలి రవాణాకు ఇబ్బందులు అవుతున్నా నిధులు మంజూరు కాలేదు. మామిడిపల్లి, సుద్దాల, నిమ్మపల్లి రోడ్డుకు నిధులు మంజూరు అయినా పనులు చేయడం లేదు. అని రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– నంద్యాడపు సాగర్, మామిడిపల్లి

నిర్లక్ష్యం చేయెద్దు



మండలంలోని నిమ్మపల్లి, కొండాపూర్, వెంకట్రావుపేట, కనగర్తి, సుద్దాల గ్రామాల మీదుగా ఉన్న రహదారి మరమ్మతుకు కొన్ని నెలల క్రితమే నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతు పనులు జరుగడం లేదు. రహదారి పనులపై నిర్లక్ష్యం చేయకుండా పనులు చేపట్టాలి.

– పెంతల శ్రీనివాస్, నిమ్మపల్లి

నిధులన్నా నిర్లక్ష్యమెందుకు



మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న రహదారులకు నిధులు మంజూరయ్యాయని ప్రకటించారు. రహదారుల పనులు అలాగే ఉన్నాయి. మూలవాగుపై వంతెనలు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. అధికారులు ఈ విషయాలపై దృష్టి సారించి వెంటనే పనులు జరిగేలా చూడాలని కోరుతున్నాం.

– షేక్ ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

త్వరలోనే ప్రారంభిస్తాం



రహదారులకు ఇటీవలే నిధులు వచ్చాయి. కొన్ని రహదారులకు ప్రతిపాదనలు పంపించాం. కొన్ని టెండర్ల స్థాయిలో ఉండగా, కొన్ని వర్షాల వల్ల ప్రారంభం కాలేదు. చంద్రంపేట-మరిమడ్ల రహదారి పనులు ఇటీవలే మొదలయ్యాయి. మామిడిపల్లి-నిజామాబాద్, మామిడిపల్లి-అజ్మీరాతండా రహదారి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి.

– సతీశ్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

ప్రతీ పేద కుటుంబానికి డబుల్ బెడ్రూం

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

వీర్నపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు ఎర్రగడ్డ తండా గ్రామాల్లో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమానికి, గ్రామాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గ్రామాలు, పట్టణాలు అనే అసమానతలను తొలిగించే ప్రయత్నంలో అందరూ సమానంగా ఎదగాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు సీఎం గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబం గౌరవంగా బ్రతకేందుకు వీలుగా రూ.5 లక్షలతో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేస్తున్నారన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

అలాగే ఆ ఇంటి మహిళ శ్రీనిధి సభ్యురాలుగా ఉంటే మరో రూ.75 వేల తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి ప్రభుత్వంపై కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా పాల్గొన్నారు.

చిత్రకథ



నిర్లక్ష్యానికి నిలువుటద్దం

వేములవాడరూరల్: హరితహారం మొక్కలను పెంచడంతో పాటు వాటి బాధ్యత కూడా పూర్తిగా తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వం చెప్పినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు సాక్ష్యం మండలంలోని వట్టెంల పంచాయతీ కార్యాలయం పక్కనే హరితహారం మొక్కలు ఎండిపోతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం నిదర్శనం.

షీ టీమ్ సేవలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సిబ్బంది

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని మహాత్మ జ్యోతిభాపూలే సంక్షేమ గురుకుల పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో షీటీమ్ సేవలు, సైబర్ నేరాలపై విద్యార్థినిలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఏఎస్ఐ ప్రేమ్ దీప్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ధైర్యంగా ఉండాలని, వేధింపులకు గురైతే తమకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100, 87126 56425, 87126 56424 నెంబర్లను సంప్రదించాలన్నారు. సైబర్ నేరాలు, తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల, షీట్ సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి

ఎల్లారెడ్డిపేట: 2003-04 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బీజేపీ మొండి చేయి చూపిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం మాట్లాడుతూ విద్యకు పది శాతం కేటాయించాల్సి వుండగా, కేవలం 2.6 శాతం కేటాయించడంతో కేంద్రానికి విద్యపై ఎలాంటి శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. బడ్జెట్‌ను సవరించి, కనీసం పది శాతం నిధులు కేటాయించి విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు.

పదోన్నతులు వచ్చే వరకు సహాయ నిరాకరణ



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: భాషా పండితులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే పదోన్నతులు కల్పించాలని, లేనిచో సహాయ నిరాకరణ ఉద్యమం చేపడతామని జిల్లా భాషా పండితుల అధ్యక్షుడు జనపాల వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వట్టెంల గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పండిత ఐక్య వేదిక పిలుపు మేరకు ఉద్యమం చేపడతామన్నారు. 9, 10 తరగతుల బోధనలను సమస్య పూర్తయ్యేంత వరకు నిలిపివేస్తామన్నారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి మంద శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బోనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాకారులు

కోనరావుపేట: ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ (ఐటీఎఫ్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న యూట్యూబ్ తల్లికి గూగులమ్మ బోనాల పేరుతో నిర్వహించే బద్దిపోచమ్మకు బోనాలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐటీఎఫ్ బాధ్యులు దుర్గం మహేశ్, మాందాల శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో బోనాల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యూట్యూబర్స్‌తో పాటు కళాకారులు అంతా కలిసి ఐటీఎఫ్ సంస్థగా ఏర్పాటు కావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవరకొండ చారి, దెబ్బ ప్రశాంత్, చెప్యాల సంతోష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం డీఈవో రాధాకిషన్‌కి వినతిపత్రం అందజేశారు. జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలోని విజ్ఞాన్ స్కూల్ ప్రమాద ఘటనపై పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్నారని, రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్, ఏబీవీపీ నాయకులు ఉన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొగి పురుగు నివారణపై అవగాహన

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట రైతు వేదికలో మొగి పురుగుపై తీసుకోవాల్సిన చర్యలు, నివారణపై జిల్లా ఏరువాక కేంద్రం డా.ఎం.రాజేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు. వరి పంటలో మొగి పురుగు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత వాతావరణంలో వాటి నివారణ కోసం సెల్ఫేడ్ ప్రభావంపై క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రాత్రి ఉష్ణోగ్రతల నుంచి సూర్యరశ్మి వరకు రోజుకు ఏడు గంటల కంటే ఎక్కువ ఉంటే ఈ పురుగు రావడానికి అనుకూలమని, మొగి పురుగు నివారణ కోసం నాట్లు వేసిన 15 నుంచి 20 రోజుల్లో కార్బోఫ్యురాన్ 3జీ గుళికలను ఎకరానికి 10 కిలోల చొప్పున ఉపయోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సందీప్, వ్యవసాయ శాఖ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోచమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామదేవత ఆలయ నిర్మాణానికి అందరు సహకరించాలని కోరారు. సర్పంచ్ తాడెపు జ్యోతి, గాడిచెర్ల దేవయ్య, మాశెట్టి లక్ష్మణ్, ఎల్లం, రాజమల్లు, రామచంద్రం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



ఘనంగా పెద్దమ్మ సిద్దోగం

వీర్నపల్లి: మండలం రంగంపేటలో పెద్దమ్మ సిద్దోగం వేడుకల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజులు మహిళలు ఇంటికి ఒక బోనం చొప్పున బయలుదేరి బోనాలు తీసి పెద్దమ్మకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లా, పాపా పాడి పశు సంపద సల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. బైండ్ల వాళ్ల గాంద్రింపులు, శివసత్తుల పునకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుబాయ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు రాధారపు సత్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయంత్రం మేక పిల్లను గావు పట్టి కుల పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా రాజరాజేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంటలో పురాతన శ్రీమెట్టు రాజరాజేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాచర్ల రఘురామశర్మ, శాస్త్రుల మెట్టు రామశర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అధివాసాంగ హవనం, రుద్ర, పంచ సూక్త హవనములు గావించారు. మూలమంత్ర హవనం చేశారు. సాయంత్రం ధాన్యాధివాస, పుష్పాధివాస, ఫలాధివాస, అన్నాధివాసం నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, గోద అంజిబాబు, తిరుపతి, వేణు, బాలమల్లయ్య , శ్రీనివాస్, స్వామితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నియామకం

సెస్ గ్రామ ప్రతినిధులు వీరే

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో సెస్ ప్రతినిధులుగా సాసాల రాజారాం , తీపిరెడ్డి లక్ష్మారెడ్డి, ధర్మారంలో కొమ్ము ఎల్లయ్య, బాపురెడ్డి ఎన్నికయ్యారు.

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ నుంచి మహిమల సంగారెడ్డి, మంద నారాయణ, పద్మనగర్ నుంచి కందికట్ల ప్రభాకర్, బెంద్రం తిరుపతిరెడ్డిని సెస్ గ్రామ ప్రతినిధులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలో సెస్ విలేజ్ రిప్రజెంట్లుగా బోయిని లింబయ్య, జంగం రాజం లు ఎన్నికయినట్లు సెస్ ఎన్నికల అదికారి తౌటు లావణ్య తెలిపారు.

చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సెస్ ప్రతినిధులుగా మర్రి హన్మండ్లు, పడిగేల కొండయ్యను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు అభినందన



నగదు బహుమతి అందజేస్తున్న హెచ్ఎం

సిరిసిల్లఅర్బన్: సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్టులు వినూత్న ఆవిష్కరణలు చేసిన కుసుమ రామయ్య బాలుర పాఠశాలకు చెందిన సీహెచ్ చక్రధర్, సీహెచ్ రుతికలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరబ్రహ్మమూర్తి అభినందించారు. 30 మంది విద్యార్థులకు జూనియర్ సైంటిస్టులుగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1500 నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, సరిత, శ్రీహరి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రభాకర్‌రావు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో వేములవాడ ఏఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. శిబిరంలో 183 పశువులకు పరీక్షలు నిర్వహించి, చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. పశువుల ఆరోగ్యంపై రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాట్ల అశోక్, ఎంపీటీసీ రేణుక, ఉపసర్పంచ్ చంద్రం, పశువైద్యాధికారి అంజిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వుచిడి రాజిరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లు రాక ఇబ్బందులు

సిరిసిల్లటౌన్: రెండు నెలల నుంచి ఆసరా పింఛన్లు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా ఆసరా పింఛన్లు ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటుందని, కానీ రెండు నెలల నుంచి పింఛన్లు రాక వృద్ధులు, దివ్యాంగులు వితంతు, బీడీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సామల మల్లేశం, కడారి రాములు, మంచికట్ల రమేశ్, అజ్జ వేణు, మంత్రి చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా రఘు బోనాలు

కోనరావుపేట: మండలం కొలనూర్‌లో జరుగుతున్న బీరయ్య-కామరాతి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవునికి పాలు, నెయ్యితో అభిషేకాన్ని నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో రఘుబోనాలు తీసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు వీరవేణి దేవేందర్, కుల పెద్దలు పాల్గొన్నారు.